

రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వ పాలన

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఏజెండాగా ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజు మంథనిలో రూ. కోటితో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానంతో పేద సంక్షేమం ప్రధాన ఏజెండాగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా దేశం ఆవిర్భవించడానికి అంబేద్కర్ కీలక పాత్ర పోషించాడన్నారు. అట్టడుగు వర్గాల్లో జన్మించి ప్రపంచ మేధావిగా ఎదిగి దేశ రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించాడన్నారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, 15 రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. రూ. 200 కోట్లతో అడవిసోమన్‌పల్లి వద్ద యంగ్ ఇండియా గురుకుల పాఠశాల పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. నాయకులు ఐలి ప్రసాద్, శశిభూషణ్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, కొండ శంకర్, ముస్కుల సురేందర్‌రెడ్డి, కుడుదుల వెంకన్న, పేరవేన లింగయ్యాయాదవ్, సెగ్గెం రాజేష్, మంథని లక్ష్మణ్, శ్రీనివాస్, ఎరుకల ప్రవీణ్, తోకల మల్లేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష



ధర్మారంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ



మంథనిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



సుల్తానాబాద్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు



అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో డప్పు కొడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రైతువేదికలో భూభారతి పోర్టల్ వీక్షణ



ప్రసారాన్ని వీక్షిస్తున్న రైతులు

ఎలిగేడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి భూభారతి పోర్టల్‌ను ప్రారంభించే కార్యక్రమాన్ని రైతులు దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా వీక్షించారు. ఎన్నో రోజులుగా కొత్తచట్టం భూభారతి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారమార్గం సుగమం అయితే బాగుంటుందని రైతులు పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, ఏఈఓలు సురేష్, గణేష్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి


కమాన్‌పూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరికరాలకు మహిళ రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రికరణ కింద బ్యాటరీ స్ప్రేయర్లు 4, చేతిపంపులు 4, బ్రష్ కటర్1, రోటవేటర్ 1, కల్టివేటర్లు 2లు అందుబాటులో ఉన్నాయని, పాసు పుస్తకం, ఆధార్‌జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రోటవేటర్, కల్టివేటర్లకు ట్రాక్టర్ సంబంధించిన ఆర్‌సీలతో వ్యవసాయ విస్త టరణ అధికారుల్ని సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి విషు పూజ



కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గౌతమినగర్ హనుమాన్ ఆలయంలో సోమవారం అయ్యప్ప విషు పూజను వేద పండితులు మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప జన్మదినం సందర్భంగా స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మురళీధర్‌శర్మ మాట్లాడుతూ యేటా విషు పూజను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.

- మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ మధ్య పెరుగుతున్న దూరం
- అధికారిక కార్యక్రమాల్లో కలిసి రాని నేతలు
- స్థానిక సంస్థల ఎన్నికలు, అభివృద్ధి పనులపై పడనున్న ప్రభావం



కాంగ్రెస్ పార్టీలో ఎవరికివారే యమునాతీరే అన్నట్లు నాయకుల మధ్య బేదాభిప్రాయాలు మొదలయ్యాయి. కొన్ని రోజులుగా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ మధ్య దూరం పెరుగుతుం డడం పార్టీలో చర్చనీయాంశంగా మారుతోంది. అధికారిక కార్యక్రమాల్లో ఎవరివారే పాల్గొంటున్నారు. మంత్రి, ఎమ్మెల్యేలు అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలకు ఎంపీ హాజరు కాకపోవ డంపై పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంటున్నది. సోమవారం జరిగిన అంబేద్కర్ జయంతి సందర్భంగా పార్టీలో లుకలుకలు మరోసారి బయటపడ్డాయి.

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లిలో సోమవారం అధికారికంగా నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యేలు, ఎంపీ ఒకే వేదికను పంచుకోకపోవడం గమనార్హం. ఎంపీ గడ్డం వంశీకృష్ణకు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్‌లతో సమన్వయం లోపించి నట్లుగా కనబడుతోంది. డిసెంబర్ 4వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఎంపీ వంశీకృష్ణ తన విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని. అధికారిక కార్యక్రమాలకు ఆహ్వా నించడం లేదని మాట్లాడారు. అనంతరం పెద్దపల్లిలో ప్రెస్‌మీట్ నిర్వహించిన ఎంపీ మరోసారి అధికారులపై విమర్శలు గుప్పిం చారు. మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పెద్దపల్లిలో అధికారికంగా నిర్వహించలేదని తప్పు పట్టిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎంపీ రెండు, మూడు చోట్ల ఆయా కార్యక్రమాల్లో మినహా ఎక్కడ కూడా కనబడలేదు.

జనవరి 23, 24 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ గ్రామసభల్లో పలు చోట్ల పాల్గొన్నారు. ఎంపీకి, మంత్రి, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేనట్లుగా కనబడుతోంది. ఎంపీ వంశీకృష్ణ మంచిర్యాల జిల్లాకు వెళ్లే సమయంలో సుల్తానాబాద్, పెద్దపల్లి, గోదావరిఖనిలో ఆయన వర్గీయులతో కలిసి వెళుతు

(మిగతా 8వ పేజీలో)

● ఎంపీ నిధుల ప్రతిపాదనలు ఏవీ...

ఎంపీలకు యేటా నియోజకవర్గ అభివృద్ధికి 10 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. ప్రస్తుతం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి 5 కోట్ల నిధులు కేటాయించింది. ఆ నిధులతో పని చేసేందుకు ప్రతి పాదనలు రూపొందించాల్సి ఉంటుంది. మార్గదర్శకాల ప్రకారం ఎక్కడెక్కడ పనులు చేపట్టాలో ముందుగా ఆ పనులకు సంబంధించి అంచనాలు రూపొందించాల్సి ఉంటుంది. 5 లక్షల రూపాయల వరకు చేసే పనులను నామినేషన్ పద్ధతిన చేపడతారు. అంతకు మించితే టెండర్లు నిర్వహిస్తారు. ఈ నామినేషన్ పద్ధతిన చేపట్టే పనుల కోసం ఎంపీ వర్గీయులు ఇంజనీరింగ్ శాఖాధి కారుల వద్దకు వెళితే అంచనాలు తయారు చేయడం లేదని ఒక సీనియర్ నాయకుడు ఆంధ్రజ్యోతికి తెలి పారు. దీనికి కారణం ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేకపోవడమేనని తెలుస్తున్నది. దీని ప్రభావం అభివృద్ధి పనులపై, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశాలు లేకపోలేదని నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. ప్రతిపక్షాలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లే విధంగా నేతలంతా కలిసి పని చేసేలా పార్టీ అధిష్టానం చొరవ తీసుకోవా లని పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.

ప్రజల సౌకర్యం కోసమే రోడ్ల నిర్మాణం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

మంథని/మంథనిరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు రోడ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గంగాపురి-ఓడేడ్ రహదారి నిర్మాణానికి రూ.60 కోట్లు, ఎక్లాస్‌పూర్-ఖమ్మంపల్లి వరకు రూ.11.90 కోట్లతో రోడ్డు నిర్మాణం పనులకు కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య ఉండకుండా రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. రోడ్ల నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా నిర్మించాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఒక్క రోడ్డు వేస్తే 15 ఏళ్ళ పాటు ఎలాంటి సమస్య రాకుండా ఉండాలన్నారు. బగుళ్ళగుట్ట దేవాలయాన్ని దర్శించుకోవటానికి వివిధ ప్రాంతాల వచ్చే భక్తులకు సౌకర్యం కోసం రూ.2 కోట్లతో రోడ్డు, విద్యుత్ పనులు పూర్తి చేశామన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కిషన్ రావు, ఈఈ భావ్‌సింగ్, ఆర్డీవో సురేష్‌లు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన రోడ్డు పనులను నాణ్యతతో నిర్మించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులతో పలు ప్రాంతాలలో చేపడుతున్న రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. పాత జెండా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు దశాబ్దాల అనంతరం రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. పూసాల రోడ్డులో మిగిలిపోయిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఐబీ చౌరస్తా నుంచి గట్టేపల్లి రోడ్డు వరకు పనులు వేగవంతం చేయాలని సూచించారు. పన్నాల రాములు, బిరుదు కృష్ణ, అబ్బయ్యగౌడ్, సంతోష్‌రావు, అమీనొద్దిన్, రఫీ, పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో అగ్నిమాపక వారోత్సవాలు



ఫైర్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐఎస్ఎఫ్ అధికారులు

జ్యోతినగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీలో సోమవారం జాతీయ అగ్నిమాపక(ఫైర్ సర్వీస్) వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జాతీయ ఫైర్ సర్వీస్ డే సందర్భంగా వారం రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలను ఎన్టీపీసీ జీఎం ఎ.కె.త్రిపాఠి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ముంబయ్ పోర్టులో అగ్ని ప్రమాదంలో మంటలను ఆర్పుతూ ప్రాణత్యాగం చేసిన అమరులకు ఎన్టీపీసీ జీఎం త్రిపాఠి, సీఐఎస్ఎఫ్ సీని యర్ కమాండెంట్ అరవింద్ కుమార్ నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా జీఎం త్రిపాఠి మాట్లాడుతూ జాతీయ పారిశ్రామిక ఆస్తులను కాపాడడంలో సీఐఎస్ ఎఫ్ చేస్తున్న సేవలు మరువ లేనివన్నారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా సీఐఎస్ఎఫ్ జవానులు నిత్యం కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, అధికారులతో ఫైర్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఎన్టీపీసీ ఉద్యోగులు, విద్యార్థులు, సీఐఎస్ఎఫ్ జవానులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తారు. ఫైర్ సర్వీస్ వీక్ ఈనెల 20న ముగుస్తుంది. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఒ.వి.కె. శాస్త్రి, ఉద్యోగులు, అధికారులు, జవానులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

- గోదావరిఖని వన్‌టౌన్‌లో కేసు నమోదు

6

తరలుతున్న టేకు కలప

- ఎస్సారెస్పీ స్థలంలో టేకు వనం
- రాత్రికి రాత్రే నరికివేత
- పట్టించుకోని అధికారులు

- రోజుకు 1200 నుంచి 1500ఓపీ
- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తరలివస్తున్న రోగులు

'ఖని' జనరల్ ఆసుపత్రిలో మెరుగైన సేవలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజు రోజుకు రోగుల తాకిడి పెరుగుతుంది. ఒకప్పుడు వంద పడకల ఆసుపత్రిగా ఉన్న గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ కళాశాల ప్రారంభమైన తరువాత 362పడకల ఆసుపత్రిగా మారింది. కళాశాలకు అనుబంధంగా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు, జూనియర్ వైద్యులు సేవలు అందిస్తుండడంతో వైద్యం కోసం రోజూ 1200 నుంచి 1500మంది వస్తున్నారు. గైనిక్ సేవలు మెరుగు పడడంతో పాటు ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలతోపాటు కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపా లపల్లి, పెద్దపల్లి జిల్లాల్లోని పలు మండలాల నుంచి రోగులు వస్తున్నారు. రోజూ ఓపీ కిటకిట లాడుతుంది. అన్నీ విభాగాలు అందుబాటు లోకి రావడంతో రోగుల తాకిడి పెరిగింది. గతంలో కంటే ఇప్పుడు సేవలు మెరుగు పడ్డాయి. ముఖ్యంగా పిడియాట్రిక్, గైనిక్, ఆర్థో విభాగాల్లో రోగులు అధికంగా ఉంటున్నారు. సిటీ స్కాన్, ల్యాబ్, చర్మ వ్యాధి నిపుణులు, పల్మలాజిస్ట్, సైకాలజిస్ట్ వైద్యులు కూడా అందుబాటులోకి వచ్చారు.



రోగులతో కిటకిటలాడుతున్న గోదావంరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి


● క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు చేస్తే గుండె వ్యాధులకు చెక్...

ఆసుపత్రి ఆవరణలో ఐదు అంతస్థుల భవన నిర్మాణ పనులు వేగవంతం అవుతున్నాయి. ఈ నిర్మాణాన్ని ఆగస్టు చివరికల్లా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో క్యాత్ ల్యాబ్ ఏర్పాటు చేస్తే గుండె వ్యాధులకు చికిత్స అంద నుంది. గుండె వ్యాధి నిపుణులు లేకపోవడంతో కోల్‌బెల్ట్‌లో చాలా మంది గుండెకు సంబంధించిన వ్యాధులతో సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే కార్డియో విభాగం కూడా అందుబాటులోకి రానున్నాయి.



త్వరలోనే ఎంఆర్ఐ, కార్డియాలజీ విభాగం...

- ప్రిన్సిపాల్ హిమబిందు



జనరల్ ఆసుపత్రిలో ఇప్పటికే సిటీ స్కాన్ అందుబాటులోకి తీసుకువచ్చాం. త్వరలోనే ఎంఆర్ఐ స్కాన్ కూడా అందుబాటులోకి రానుంది. రోగులకు నిరంతరం వైద్య సేవలు అందించడానికి 24గంటలు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. నూతన భవనం పూర్తయితే క్రిటికల్ కేర్‌తోపాటు కార్డియో విభాగాన్ని అందుబాటులోకి తీసుకువస్తాం. రోగులకు మరిన్ని వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

బైక్‌ను ఢీకొట్టిన కారు

● ముగ్గురికి తీవ్రగాయాలు



గాయాలపాలైన క్షతగాత్రులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దైవదర్శనానికి వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు పక్కన బైక్‌పై ఆగివున్న వ్యక్తులను మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ స్పీడ్‌గా వచ్చి ఢీకొట్టాడు. వేములవాడ మండలం అనుపురం గ్రామశివారులో ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజీపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ తన భార్య రజిత, కొడుకు అభిరామ్‌తో కలిసి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. తిరిగి తమ ద్విచక్రవాహనంపై అర్ధరాత్రి ఖాజీపూర్ వెళుతున్న క్రమంలో అనుపురం గ్రామం వద్ద ఆగారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి వేములవాడకు వస్తున్న ఓ కారు రోడ్డుపక్కన ద్విచక్రవాహనం పక్కన నిల్చుని ఉన్న వెంకటేశ్, రజిత, కొడుకు అభిరామ్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటేశ్, అభిరామ్ కాళ్లకు తీవ్రగాయాలు కాగా, రజిత తలకు గాయాల య్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఉన్న ముగ్గురిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా

● ముగ్గురికి తీవ్రగాయాలు



బోల్తా పడిన ఆటో

శంకరపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన కూలీలు సోమవారం ఆటోలో కూలీపనికి వెళ్లివస్తుండగా ఆముదాలపల్లి శివారులోని బ్రిడ్జి వద్ద ఆటో అదుపుతప్పి బ్రిడ్జి కింద పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్‌కు చెందిన కనకం అంజయ్య ఆటోలో అతని భార్య సారమ్మ, కోడళ్లు నందిని, సంగీతతోపాటు కుక్కముడి వీరయ్య, అతని భార్య ఎల్లమ్మ, మాతంగి మధురమ్మ, మాతంగి శంకరమ్మ తీసుకొని ఉదయాన్నే వీణవంక మండలం కాపులపల్లెకు మొక్కజొన్న కంకి పొత్తు తీయడానికి వెళ్లారు. పనిముగించుకొని తిరిగి వస్తుండగా, ఆముదాల పల్లి శివారులో బ్రిడ్జి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8మందిలో ఐదుగురికి గాయాలు కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ ఆటోడ్రైవర్ అంజయ్య, మధురమ్మ, శంకరమ్మను 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి నట్లుసమాచారం.మిగిలినవారుసమీపఆస్పత్రిలోచికిత్స పొందుతున్నారు.

పిచ్చికుక్కల దాడిలో 14మందికి గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్కలు దాడిచేసి 14 మందిని గాయపర్చినట్లు మోరపల్లి గ్రామస్థులు తెలిపారు. గాయపడ్డ వారిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కల బారి నుంచి కాపాడాలని మోరపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.





తరలుతున్న టేకు కలప

ఎస్సారెస్పీ స్థలంలో టేకు వనం

పట్టించుకోని అధికారులు

ఓదెల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ఎస్సారెస్పీ టేకువనం దొంగల పాలవుతుంది. 15 యేళ్ల క్రితం నాలుగు గుంటల భూమిలో దాదాపు 150 టేకు మొక్కలు నాటారు. వీటికి సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో 50 చెట్ల వరకు ఎండిపోగా, మిగిలిన 100 చెట్లు వృక్షాలుగా మారుతుండగా ఒక్కొక్క చెట్టు దొంగల పాలవుతున్నాయి. మూడేళ్ల క్రితం ఎస్సారెస్పీ క్యాంపులో కొందరు గ్రామస్థులు నివాసం ఉండడంతో టేకు వనానికి రక్షణగా ఉండేది. వారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి మారడంతో విలువైన టేకు కలప మాయమైపోతుంది.

రెండేళ్ల క్రితం గాలి దుమారానికి రెండు పెద్ద చెట్లు నేల కూలి పోగా అవి దొంగల పాలయ్యాయి. మిగిలిన వాటిని రక్షణ లేకపోవడంతో రాత్రి వేళలో మిషన్‌లతో చెట్లను కోసి తీసుకెళ్తున్నారు. దీంతో వనంలో చెట్ల మోడులు దర్శనమిస్తున్నాయి. మిగిలిన వృక్షాలను వేలం వేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో నెలకొక్క టేకు చెట్టును కట్టర్లతో కోసుకెళుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో భవనాల నిర్మాణం అధికమవడంతో టేకు కలపకు డిమాండ్ పెరిగింది. దీంతో ఒక్కొక్క చెట్టు చోరీకి గురవుతోంది. టేకు కలప చోరీ ఇంటి దొంగలా లేక బయటి దొంగల పనా అనే అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఎదిగిన చెట్లను వేలం వేసి దొంగల పాలవకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రహరీ నిర్మిస్తాం : ఏఈఈ రాజు



ఎస్సారెస్పీ భూమిలో సర్వేయర్‌తో కొలతలు వేయించి, లేఅవుట్ ఏర్పాటు చేస్తాం. ఎస్సారెస్పీ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి చెట్లు చోరీకి గురికాకుండా చూస్తాం. నిధుల కోసం ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం.

టేకు కర్రను విక్రయించాలి

వేయి గండ్ల తిరుపతి, గ్రామస్థుడు, పొత్కపల్లి



టేకు కర్ర దొంగల పాలవక ముందే విక్రయించి ఎస్సారెస్పీ మండల కార్యాలయంలో తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. లేకుంటే టేకు వనాన్ని కాపాడేందుకు క్యాంపులో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.

హార్వెస్టర్ ఢీకొని మహిళ మృతి

● మొట్లపల్లిలో విషాదం



కనకమ్మ(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మొట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ(50), రాగుల వసంత (45) సోమవారం భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లెలో కూలీకి వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తున్న సమయంలో వెంకట్రావుపల్లి శివారులో హార్వెస్టర్ ఢీకొనగా దాసరి కనకమ్మ అక్కడి క్కడే మృతిచెందింది. రాగుల వసంతకు తీవ్రగాయాలు కాగా 108ద్వారా చిట్యాలకు తరలించినట్లు బాధితుల కుటుంబ సభ్యులు తెలిపారు. పనికి వెళ్లి కనకమ్మ మృతి చెంది వసంతకు తీవ్రగాయాలు కావడంతో వారితో పనికి వచ్చిన తోటి కూలీల రోదనలు మిన్నంటాయి.

కోడెలను తరలిస్తున్న వాహనం పట్టివేత

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి ఎడ్లను తరలిస్తున్న వాహనాన్ని సుల్తానాబాద్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గడ్చిరోలి నుంచి నాలుగు ఎడ్లను ఒకట్రాలీలో తరలిస్తుండగా సుల్తానాబాద్‌కు చెందిన భూసారపు సంపత్, పృథ్వీ బండారు సూర్య పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



పట్టుబడిన వాహనం



రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా రథోత్సవం

గంగాధర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలం కోట్లనర్సింహులపల్లిలో సోమవారం లక్ష్మీ నర్సింహస్వామి, సీతారామ చంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల రథోత్సవం ఘనంగా సాగింది. అనంతరం ఉత్సవమూర్తులను గరుడ, ఆంజనేయ, అశ్వవాహనములపై ఆలయ పునఃప్రవేశం చేశారు. పండితులు శేషహోమం, మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, ఏకాంతసేవ తదితరాలు నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టుచేసినట్లు రూరల్‌ఎస్సై మారుతి తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన రాకేష్, సాయి కిరణ్, బీహార్‌కు చెందిన సనీల్ దాదాపు 100 గ్రాముల గంజాయిని తరలి స్తుండగా ఫాజుల్‌నగర్ గ్రామంలో వారిని పట్టుకుని అరెస్టుచేసినట్లు తెలిపారు. రూరల్‌సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు.


గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి

మల్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని దివ్యాంగ యాచకుడు(45) దుర్మరణం చెందాడు. మృతుడికి కుడి కాలు మోకాలు వరకే ఉండగా కొండగట్టులో యాచిస్తూ జీవిస్తున్నాడు. నిత్యం రహదారి పక్కనే పడుకునే యాచకున్ని సోమవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం తలపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలు అయి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేశారు.

శివరాంపల్లి దర్గాలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

● కేసు నమోదు



దర్గాలో తవ్విన గుంత

సైదాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపల్లి దర్గాలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడం కలకలం రేపుతోంది. వివరాలలోకి వెళ్తే.. సైదాపూర్ మండలంలోని శివరాంపల్లి దర్గాలో గుప్తనిధుల కోసం కొందరు వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. ఫ్లోరింగ్ పగుల గొట్టి గుంతలు తవ్వారు. గ్రామంలో కొందరు ముస్లింలు దర్గాకు దర్శనం కోసం వెళ్లగా దర్గాలో లోతైన గుంతలు ఏర్పడి ఉన్నాయి. దీంతో వారు అనుమానం ఉన్న వారిని పిలిపించి అడుగగా పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆదివారం అదే గ్రామానికి చెందిన సయ్యద్‌సర్థార్ అనేవ్యక్తి సైదాపూర్ పోలీస్ స్టేషన్ను ఆశ్రయించాడు. మా గ్రామంలోని దర్గాలో గుప్తనిధుల తవ్వకాలు జరిగాయన్నారు. దీనికి కారణం కరీంనగర్‌కు చెందిన గౌసియా బేగం, ఆమె కుమారుడు యాకుబ్ పాషా, ఆమె కోడలు నేహాలే కారణమన్నారు. వారు కొన్ని రోజులుగా దర్గాపరిసరాలలో కనిపిస్తున్నారని, దర్గాకమిటీ అనుమతి లేకుండా వారు అక్రమంగా దర్గాలోకి ప్రవేశించి దర్గా లోపల గుప్త నిధుల కోసం తవ్వకాలు చెపట్టారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. సయ్యద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రేషన్ బియ్యంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● గోదావరిఖని వన్‌టౌన్‌లో కేసు నమోదు

కోల్‌సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ షాపుల్లో సన్నబియ్యం పేర ప్లాస్టిక్‌బియ్యాన్ని పంపిణీ చేస్తుం దంటూ గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్టు చేయడం కలకలం రేపింది. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఒక డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ నిర్వాహకుడు తిలక్‌నగర్‌లోని ఒక రేషన్ షాపులో మేము తీసుకున్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చిందంటూ నాలుగు రోజుల క్రితం సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. ప్రజలారా ఆరోగ్యం జాగ్రత్త అంటూ హెచ్చరించాడు. కిలో బియ్యంలో 100గ్రాముల ప్లాస్టిక్ బియ్యం అంటూ ఆ వీడియోలో పేర్కొన్నాడు. విజయ్ ఎంజే కొరియో గ్రాఫర్ అకౌంట్‌పై ఈ పోస్టు పెట్టడంతో వైరల్‌గా మారింది. దీనిపై సివిల్ సప్లయి అధికారులు విచారణ జరిపారు. గోదావరిఖని పట్టణంలోని పలు రేషన్ షాపుల్లో సోమవారం ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సివిల్‌సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా కూడా ఎలాంటి కల్తీ ఆనవాళ్లు లేవని డీఎస్‌ఓ పేర్కొన్నారు. ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడం ద్వారా ప్రభుత్వాన్ని, పౌరసరఫరాలశాఖను బదనాం చేసేందుకు ఈపోస్టు పెట్టినట్టు భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దీనిపై పౌరసరఫరాల శాఖ డీటీ రవీందర్‌రెడ్డి సోమవారం సాయంత్రం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. పోలీసులు విచారణ ప్రారంభించడంతో పోస్టుపెట్టిన వ్యక్తి సోషల్ మీడియాలో వెంటనే ఆ పోస్టును డిలీట్ చేశాడు.

అర్చకుల మధ్య వివాదంతో ఆలయానికి తాళం

● పోలీసుల జోక్యంతో తెరుచుకున్న ఆలయం

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలో ఇద్దరు అర్చకసోదరుల మధ్య నెలకొన్న వివాదంతో సోమవారం ఆలయానికి తాళం పడింది. జగిత్యాలలోని నిజామాబాద్ రోడ్డులో గుట్ట రాజేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ గుర్తింపుఉంది. ఈఆలయానికి వంశ పారంపర్య ధర్మకర్తగా, అర్చకులుగా ఇద్దరు సోదరులు వ్యవహరిస్తున్నారు. దేవా దాయ కమిషనర్ ఉత్తర్వులమేరకు ఓ సోదరుడితో పాటు అతడి ఇద్దరు కుమారులు ప్రస్తుతం అర్చకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో మరో సోదరుడు సోమవారం ఆలయానికి తానే అర్చకుడినని తన వద్ద జీవో ఉందంటూ గుడిమెట్ల మార్గంలో ఉన్న గేటుకు తాళం వేశాడు. దీంతో మరో సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తాళం తీయించారు. దీంతో సమస్య తాత్కాలికంగా సర్దుమణిగింది. అయితే ఇద్దరి అర్చకులమధ్య వివాదంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఈవిషయంపై దేవాదాయశాఖ ప్రత్యేక దృష్టిసారించాలని పలువురు భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి: ఎనిమిది మందిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ పేకాట స్థావరంపై సోమవారం రాత్రి టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈదాడుల్లో ఎనిమిదిమంది ప్రముఖులను పట్టుకొని వారివద్ద రూ.30,930 నగదు, 8మొబైల్‌ఫోన్‌లు,52కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. విద్యానగర్‌లోని ప్రముఖ నాయకుడి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పక్కాసమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. ఈతనిఖీల్లో 8మంది పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి పీఆర్టీయూ ఆర్థికసాయం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఔట్ సోర్సింగ్‌లో ఒకేషనల్ టీచర్‌గా పనిచేస్తున్న బంధారపు నవీన్ కుమార్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడంతో ఆ కుటుంబానికి పీఆర్‌టీయూ నాయకులు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. పీఆర్‌టీయూలో క్రియాశీలక సభ్యత్వం కలిగిన నవీన్‌కుమార్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని పీఆర్‌టీయూ టీఎస్ మాజీ అసోసియేట్ అధ్యక్షుడు వంగ మహేందర్ రెడ్డి నవీన్‌కుమార్ సతీమణి కిరణ్మయికి చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గన్నమనేని శ్రీనివాసరావు, ఎడ్ల కిషన్, ట్రైబల్ టీచర్ ఫెడ రేషన్ నాయకులు భూక్య అర్జునాయక్, మండల ప్రధాన కార్యదర్శి బూర్ల సత్యనారాయణ, ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి కాలనీలో దొంగతనం

● 17.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు చోరీ



విచారణ చేస్తున్న సీఐ సృజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సప్తగిరికాలనీలో ఆదివారం అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగింది. 17.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల వివరాల ప్రకారం.. సప్తగిరి కాలనీకి చెందిన నేరెళ్ల రమేష్‌గౌడ్ ఆదిలాబాద్ భుక్తాపూర్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం కరీంనగర్‌లో బంధువుల ఇంటిలో శుభకార్యానికి హాజరైన రమేష్‌గౌడ్ దంపతులు రాత్రి సప్తగిరి కాలనీలోని తమ ఇంటికి చేరుకున్నారు. వేసవికావడంతో ఇంటికి రెండు వైపుల తలుపులు తెరిచి నిద్రించారు. అర్ధరాత్రి వేళ దొంగలు ఇంట్లోకి చొరబడి హ్యాండ్‌బ్యాగ్, బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం బ్యాగ్ చూసుకోగా అందులో బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. బీరువా తెరిచి ఉంది. దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గ్రహించిన బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన వంగ మల్లయ్య అనే గీత కార్మికుడు సోమవారం తాటి చెట్టు పై నుంచి కిందపడగా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సుల్తానాబాద్‌ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ తరలించారు. గాయపడిన కార్మికుడిని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ పరామర్శించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

● తప్పిన పెనుప్రమాదం

మల్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టు బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సును వెనుకాల నుంచి వచ్చిన కారు ఢీకొంది. ప్రయాణికులతో ముందుకు కదులుతున్న బస్సును కారు ఢీకొనడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు బారులు తీరగా పోలీసులు ట్రాఫిక్ తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. కాగా ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని స్థానికులు తెలిపారు.

పేదలకు అండగా.. ఆలయ ఫౌండేషన్

● పుట్టిన ప్రాంతంపై మమకారంతో ఐఏఎస్ సేవలు

వీణవంక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రాంతంపై ప్రేమతో ఇక్కడి పేదలను ఆదుకునేందుకు ఐఏఎస్ అధికారి పి నరహరి 2015లో ఆలయ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. పలువురు స్థానికులను కో ఆర్డినేటర్లుగా నియమించి వారి ద్వారా ఆపదలో ఉన్నవారికి తమకు తోచిన విధంగా సహాయం అందిస్తున్నారు.

● పలు సేవా కార్యక్రమాలు

ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీణవంక మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు అందజేశారు. కనపర్తి గ్రామానికి చెందిన కోల రాజయ్యకు జైపూర్ ఫుట్‌ను అందించారు. వల్భాపూర్ గ్రామానికి చెందిన నామని రాజయ్యకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందించారు. విద్యార్థులకు కోర్సులపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. పేదంటి ఆడపిల్లల పెళ్లిలకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ ఫౌండేషన్‌కు 600మంది వలంటీర్లు ఉన్నారు.

● సేవలు విస్తరిస్తాం..

- గాదె గుణసాగర్,

ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్

నిరుపేదలకు ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలురకాల సేవలు అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో యువతకు ఉపాధి, విద్యలో ఎక్కువగా సాయం అందిస్తాం. మమ్మల్ని సంప్రదించిన వారికి తప్పకుండా సాయం అందిస్తున్నాం. సేవలు విస్తరించేందుకు ప్రణాళి కలు రూపొందిస్తున్నాం.



ఘన్ముక్లలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న ఆలయ ఫౌండేషన్ సభ్యులు(ఫైల్)

ఆచూకీ తెలపరూ..!

మావోయిస్టు నేత బెజ్జారపు కిషన్ భార్య పుష్ప విన్నపం



భార్య పుష్పతో కిషన్(ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తన భర్త ఎక్కడ ఉన్నడో ఆచూకీ తెలపాలని మావోయిస్టు నేత బెజ్జారపు కిషన్ భార్య పుష్ప వేడుకుంటోంది. కోరుట్ల పట్టణంలోని నారాయణ-నర్సమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు కిషన్. కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన పుష్పతో ఆయనకు 1976 లో వివాహం జరిగింది. 1978లో జరిగిన జగిత్యాల జైత్రయాత్రలో పాల్గొని సాయుధ పోరాటం వైపు ఆకర్శితుడైన కిషన్ జగిత్యాల కేంద్రంలో బుల్లెట్ వాహన మెకానిక్‌గా పని చేసేవాడు. 1980లో సాయిని ప్రభాకర్ నేతృత్వంలో ఉద్యమం వైపు ఆకర్షితుడైన బెజ్జారపు కిషన్ పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లాడని భార్య పుష్ప తెలిపింది. అజ్ఞాతంలోకి వెళ్లిన తన భర్త కిషన్ సమాచారం ఇప్పటికీ తెలియ లేదని వాపోయింది. 2012లో నూతన సంవత్సరం శుభాకాంక్షలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కిషన్ ఫొటోతో రివార్డును ప్రకటించారు. అదే సమయంలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో కూడా కిషన్‌పై రివార్డును ప్రకటించారు. కిషన్ తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందగా వారి అంత్యక్రియలకైనా వస్తాడని కుటుంబ సభ్యులు ఆశించినా అతను మాత్రం రాలేదు. కిషన్ జాడ కోసం భార్య పుష్ప పలు మార్లు పౌర హక్కుల నాయకులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో ఏ ఎన్‌కౌంటర్ జరిగినా ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని కిషన్ భార్య ఆందోళన చెందుతోంది. ఆమె ప్రస్తుతం బీడీలు చుడుతూ కాలం వెల్లదీస్తోంది.



బీడీలు చుడుతున్న పుష్ప

ఫేస్‌బుక్ పోస్టులు పేదల జీవితాల్లో వెలుగులు

- పదేళ్లలో రూ.1.75 కోట్ల విరాళాల సేకరణ
- 26 మంది నిరు పేదలకు ఇళ్ల నిర్మాణం
- ఆదర్శంగా నిలుస్తున్న సామాజిక సేవకుడు రమేష్



విరాళాలతో అప్పటి కలెక్టర్ రవి చేతుల మీదుగా సైకిళ్లు పంపిణీ చేయిస్తున్న సామాజిక సేవకుడు రమేష్ (ఫైల్)

ధర్మపురి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో కొందరు సోషల్ మీడియాను కాలక్షేపానికి, మరికొందరు వినోదం కోసం వినియోగిస్తున్నారు. అందుకు భిన్నంగా జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ ఫేస్‌బుక్‌ను పేద ప్రజలకు సాయం చేయడానికి వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. 2015 సంవత్సరంలో సేవా కార్య క్రమాలు ప్రారంభించిన రేణికుంట రమేష్ ఇప్పటి వరకు 141 మంది నిరుపేద కుటుంబాలకు రూ.1.75 కోట్ల విరాళాలను దాతల ద్వారా పంపిణీ చేయించారు.

దశాబ్ద కాలంగా సమాజ సేవ

ధర్మపురి మండలం బుగుదేశిపల్లె గ్రామానికి చెందిన రాగుల వైష్ణవి అనే విద్యార్థిని పదేళ్ల క్రితం అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం అయ్యింది. బ్రెయిన్ ఆపరేషన్ చేయాల్సి ఉండగా కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడం వల్ల వైద్యం చేయించలేక పోయారు.

ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న రమేష్ చిన్నారి దీనస్థితిని చూసి చలించిపోయాడు. ఎలాగైనా చిన్నారికి ఆపరేషన్ చేయించాలని రమేష్ అనుకున్నాడు. దీంతో వైష్ణవి ఆరోగ్య సమస్యను, కుటుంబ దీనస్థితిని వివరిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, స్థానికులు, ఇతర దాతలు రూ.9 లక్షలు రూపాయలు పంపించారు. దాతల సాయంతో సర్జరీ చేయించి, మిగతా డబ్బులు బాధితురాలి పేరు మీద బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించాడు.

వైష్ణవికి సాయం చేసిన దాతలు రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడి మరెవరైనా నిరుపేదలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రమేష్ ప్రతీ నెల ఓ నిరుపేద కుటుంబాన్ని ఎంపిక చేసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నాడు. ప్రతి నెల చివరలో బాధిత కుటుంబానికి వచ్చిన విరాళాలు, వాటిని ఉపయోగించిన తీరును వివరిస్తూ ఫేస్ బుక్‌లో మరో పోస్టును అప్‌డేట్ చేస్తాడు.

విద్య, వైద్యానికి సహాయం

పదేళ్లలో రమేష్ 141 మంది నిరుపేదలకు రూ.1.75 కోట్ల విరాళాలను పంపిణీ చేయించారు. వాటిలో 26 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం చేయించగా, మిగిలిన పేదలకు విద్య, వైద్యం కోసం సాయం అందించారు. 200 మంది నిరుపేద విద్యార్థుల కోసం సైకిళ్ల పంపిణీ చేయించారు. కేవలం ఒక ప్రాంతానికో, ఒక జిల్లాకో పరిమితం గాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని నిరుపేద ప్రజల కోసం రమేష్ ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్నాడు. దాతల ద్వారా సాయం అందిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు రమేష్.

దాతల ఔదార్యంతోనే సేవా కార్యక్రమాలు

రేణికుంట రమేష్, సామాజిక సేవకుడు, ధర్మపురి



దాతల ఔదార్యంతో పదేళ్ల నుంచి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నా. పేదరికంతో పాటు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాల నుంచి ప్రతీ నెల ఒక కుటుంబాన్ని ఎంపిక చేసి వారికి దాతల ద్వారా సాయం అందేలా చూస్తున్నా. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన బళ్లారి మిత్రులు, జగిత్యాలకు చెందిన సత్య సాయి అభయ హస్తం సభ్యులు, హైదరాబాద్‌కు చెందిన సినీ హీరో చిరంజీవి అభిమానులు, స్థానిక దాతలు సాయం అందిస్తున్నారు. పేదలకు సాయం అందించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా.







జగిత్యాలలో అనారోగ్యానికి గురైన బాధిత కుటుంబానికి డిపాజిట్ బాండ్ అందజేస్తున్న ఎస్పీ అనంతశర్మ(ఫైల్), ధర్మపురికి చెందిన పేద మహిళా కుటుంబానికి విరాళాలు అందజేస్తున్న సీఐ (ఫైల్), మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం చేసి ఇచ్చిన సామాజిక సేవకుడు రమేష్ (ఫైల్)

పచ్చదనంతో కనువిందు చేస్తున్న చెట్లు



కొడిమ్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం పూడూర్ రోడ్డులో చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి కొడిమ్యాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు మండుటెండలో ప్రయాణికులను పచ్చదనంతో ఆకట్టుకుంటున్నాయి. నిత్యం ఈ రోడ్డుపై నుంచి ప్రయాణించే వారు కాసేపు అక్కడి ఆగి సేద తీరుతున్నారు.

కరెంటు తీగలకు కర్రలే ఊతం



వేలాడుతున్న తీగల కోసం ఏర్పాటు చేసిన కర్రలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల రామిండ్లవాడ నుంచి అక్కపల్లి గ్రామానికి వెళ్లే దారిపై విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదభరితంగా మారాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. నిత్యం రాకపోకలు సాగించే ఆయా గ్రామాల రైతులు, వాహనదారులు, ప్రజలకు కరెంటు ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ పొలాలకు సమీపంలో ఉండడం వల్ల రైతులు కిందకు వేలాడుతున్న తీగలకు రెండు కర్రలను ఏర్పాటు చేశారు. గాలి వీచినప్పుడు కర్రలు పడిపోయి ప్రమాదం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న తీగలకు బిగించిన కర్రలను తొలగించి మరమ్మతులు చేయాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

వెళ్లొస్తాం.. అంజన్నా

జయంతి ఉత్సవాలు ముగియడంతో తిరిగి వెళ్తున్న భక్తులు

హనుమాన్ చిన్న జయంతి ఆదాయం రూ.1.67 కోట్లు



స్వామివారిని దర్శించుకొని తిరిగి వెళ్తున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో జరిగిన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ముగిసినప్పటికీ సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నుంచి ఆర్జిత సేవలను యథావిధిగా ప్రారంభించారు. జయంతి ఉత్సవాలు ముగియడంతో ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు యథావిధిగా కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

- హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు లక్షలాది భక్తులు తరలిరాగా దేవస్థానానికి రూ.1,67,73,800 సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. గతేడాది చిన్న జయంతికి రూ.1,54,13,395 రాగా ఈసారి రూ.13.60లక్షలు పెరిగింది. దీక్ష విరమణల ద్వారా రూ.40,17,500 కేశ ఖండనం టికెట్ల ద్వారా రూ.11.78లక్షలు, శీఘ్ర దర్శనం ద్వారా రూ.18,61,500 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ. 81,74,600 విలువైన లడ్డూ ప్రసాదాల విక్రయాలు, రూ.15,42,200 విలువైన పులిహోర విక్రయాలు జరిగినట్లు తెలిపారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల వచ్చినవి మినహాయిస్తే రూ.70.57లక్షలు మాత్రమే ఆదాయం వచ్చినట్లు అవుతుంది.

అగ్గి అంటుకుంటే బుగ్గే

- కానరాని ఫైర్‌సేఫ్టీ నిబంధనలు
- ఐదేళ్లలో 275 అగ్ని ప్రమాదాలు
- 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14((ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు పెరగడంతో అగ్నిప్రమాదాలు ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలు అగ్నిప్రమాద నివారణకు జాగ్రత్తలు పాటించాలి. అగ్నిమాపక కేంద్రాల్లో ఆధునిక యంత్రాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వెంటాడు తోంది. ఎక్కడా ఫైర్‌సేఫ్టీ నిబంధనలు కనిపించడం లేదు. మంటలను ఆర్పడానికి అవసరమైన నీరు దొరకడం లేదు. జిల్లాలో సోమవారం ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు ఈ నెల 20న ముగియనున్నాయి.

అందుబాటులో అధునాతన యంత్రాలు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ అధునాతన యంత్రాలు ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నది. సిరిసిల్లలో ఒక అగ్నిమాపక వాహనం, మినీ వ్యాన్, బుల్లెట్‌లు ఉన్నాయి. వేములవాడలో ఒక అగ్నిమాపక వాహనం, ఒక బుల్లెట్ మాత్రమే ఉంది. వీటితో పాటు పోర్టబుల్ పంపులు, బ్రీతింగ్ ఆపరేటర్ సెట్స్, వాటర్, ఫోమ్, పౌడర్, సీఓ1 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. సిరిసిల్లలో ఒక ఫైర్ ఆఫీసర్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు డ్రైవర్‌లు, ముగ్గురు ఫైర్‌మెన్‌లు ఉన్నారు. వేములవాడలో ఒకఫైర్ ఆఫీసర్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఇద్దరు డ్రైవర్‌లు, ఇద్దరు ఫైర్‌మెన్‌లు ఉన్నారు. జిల్లాలో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే ఫోన్ నెం. 0872323 2901కు డయల్‌చేసి చెపితే వెంటనే ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను నివారించే అవకాశం ఉంది. జిల్లాలో గత ఐదు సంవత్సరాల్లో 275 అగ్ని ప్రమాదాలు జరిగాయి. దాదాపు రూ.4.61కోట్ల ఆస్తినష్టం సంభవించింది. దాదాపు 5.41కోట్ల ఆస్తులను అగ్నిమాపక సిబ్బంది సంరక్షించారు.



సిరిసిల్లలోని ఫైర్ స్టేషన్

ఇళ్లలో అగ్ని ప్రమాద సూచికలు

ప్రధానంగా ఇళ్లల్లోనే ప్రమాద సూచికలు కనిపిస్తుంటాయి. ఇళ్లల్లో ఉండే చిన్నపిల్లలు అగ్గిపెట్టెలతో ఆటలాడ టం, ఇంట్లో గ్యాస్ స్టౌ ఆన్‌చేసి మరిచిపోవడం, కిరోసిన్, పెట్రోల్‌లు ఇంట్లో నిల్వచేయడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి మరిచిపోతే అగ్గిరాజుకుంటుంది. దీపాలకు వేడిమి ఎక్కువై ఇల్లంతా మంటలు వ్యాప్తి చెందుతాయి. ఇళ్లల్లో విద్యుతు స్విచ్‌బోర్డులు ప్రతి ఏడాది మరమ్మతు చేయించుకోవాలి. స్విచ్‌బోర్డుల వల్ల షార్ట్‌సర్క్యూట్ సంభవిస్తుంది.



అగ్నిప్రమాదాలకు నెలవు

ఎండ తీవ్రతకు అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా గడ్డివాములు, గుడిసెలు, ఇతర వ్యర్థపదార్థాల కారణంగా ఎక్కువగా మంటలు వ్యాపిస్తాయి. వీటి సమీపంలో ఎవరైనా సిగరెట్, బీడీలు తాగి పారేసి వెలితే అగ్గిరాజుకుంటుంది. ఇవేకాకుండా పత్తి, మిరప, కంది, తదితర పంటలు కోసిన తర్వాత కట్టె కాలబెడుతుంటే మంటలు వ్యాపించే అవకాశం ఉంది. ఈ మంటలు పొలాల గట్లపై ఉన్న గడ్డివాములకు అంటుకుంటాయి. ఇవేకాకుండా అడవులు అంటుకొని కాలిపోతుంటాయి. మరోవైపు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భవనాల్లో మంటలు వ్యాపిస్తున్నాయి.

నివారణ చర్యలు

- వంటింటి పైభాగాల్లో గాలి వెలుతురు ఉండేలా చూడాలి
- గ్యాస్‌ట్యూబ్‌ను మార్చుకోవాలి
- సిలిండర్ వాడకం పూర్తియిన వెంటనే రెగ్యులేటర్ ఆపివేయాలి
- మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయవద్దు
- వంటిగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ ఉంచకూడదు.
- స్కూల్, షాపింగ్ కాంప్లెక్స్, ఆస్పత్రులలో ఆర్‌సిసి కాంక్రిట్ స్లాబులనే పైకప్పుగా వాడాలి.
- ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి.
- గడ్డివాములను నివాస గృహాలకు దూరంగా వేయాలి.

ప్రజల్లో అవగాహన కల్పిస్తాం

ఎన్. నరేందర్, ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల



జిల్లాలో అగ్నిప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారం రోజుల్లో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ, నియంత్రణ చర్యలపై వివిధ రూపాల్లో ప్రదర్శనలు ఇస్తాం. పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తాం. ఫైర్‌స్టేషన్‌లలో ఆధునాతన యంత్రాలు ఉన్నాయి. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నాం.

భక్త జనసంద్రం

- వేములవాడలో భక్తుల రద్దీ
- రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



వేములవాడలో బారులు తీరిన భక్తులు



ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పుణ్యక్షేత్రం సోమవారం భక్తులతో జనసంద్రంగా మారింది. రాష్ట్రం నలు మూలల నుంచి వచ్చిన భక్తులు రాజన్నకు మొక్కులు చెల్లించకున్నారు. ధర్మ దర్శ నం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్త లను దర్శించుకునేందుకు సుమారుగా మూడుగంటల సమయం పట్టింది. శీఘ్ర దర్శనం, బ్రేక్ దర్శనం క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి వెళ్లిన భక్తులు ముందుగా శ్రీలక్ష్మీగణపతిని, తరువాత రాజన్నను దర్శించుకున్నారు. తదనంతరం శ్రీ పార్వతిదేవి అమ్మవారికి ఒడిబియ్యం పోస్తూ అమ్మ వారిని వేడుకున్నారు. కోడెమొక్కును చెల్లించుకుని తరించారు. శ్రీ భీమేశ్వర, నగరేశ్వర, శ్రీబద్ది పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమ య్యారు. భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్‌లు, సూపరిండెంట్‌లు వరి నర్సయ్య, నరేందర్, రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న ఏపీ, రాజస్థాన్, తెలంగాణ న్యాయమూర్తులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఏ. హరిహరనందశర్మ, రాజస్థాన్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం. లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్. తుకరాంజీలు దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు రాజన్న ఆలయానికి రావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఘనస్వాగతం అందించగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. సోమవారం ఉదయం అర్చకులు న్యాయమూర్తులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీస్వామి వారి ప్రత్యేక పూజ అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. కాగా ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో శ్రీస్వామి వారి శేషవస్త్రం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట సిరిసిల్ల జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, స్థానిక ఎమ్మార్వో విజయ్ ప్రకాశ్‌రావు, ఏఈవో అశోక్‌కుమార్ శ్రీకాంత్‌చారి తదితరులు ఉన్నారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తులు

అంబేద్కర్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలి

ముత్తారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని ఐటీ, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మచ్చుపేట వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ త్వరలో ముత్తారంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని, జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్, అందులో గ్రంథాలయం ఏర్పాటు చేస్తామన్నారు. పెండింగ్ ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశం తమ ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయ ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేస్తుందని అన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): యువకులంతా అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అంబేద్కర్ ఒక కులానికో మతానికో చెందిన వాడు కాదని ఆయన అందరి వాడన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందని, ప్రజలంతా కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీఓ రమేష్, ఏఎంసీ చైర్మన్ రూప్లా నాయక్, బొల్లి స్వామి, కాడే సూర్యనారాయణ, దేవి జనార్దన్, పాలకుర్తి రాజేశం, దేవి రాజలింగయ్య, కాంపెల్లి చంద్రశేఖర్, కాంపెల్లి రాజేశం మాట్లాడారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ భావజాలం ఆధారంగా నూతన భారత నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దళిత సంఘాల నాయకులు విన్నవించారు. నాయకులు కుక్క రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన పీఏసీఎస్ చైర్మన్ ఇనుగంటి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, నాయకులు చంద్రమౌళి, చిప్పకుర్తి సత్యనారాయణ, అంబటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కలువల శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొదరుపాకలో బీజేపీ ఓబీసీ జిల్లా చైర్మన్ చాతరాజు రమేష్, గర్రెపల్లిలో జెట్టి శ్రీనివాస్, వడ్లకొండ మహేష్ గౌడ్, లక్ష్మణ్, హరీష్ రాజు తదితరులు జయంతి కార్యక్రమం నిర్వహించారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను సింబల్ ఆఫ్ నాలెడ్జ్‌గా కొలుస్తారని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి అన్నారు రాఘవపూర్‌లో అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కల్లెపల్లి అశోక్, శ్రావణ్, నవీన్ పాల్గొన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో జయంతి నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దళితకాలనీ నుంచి డప్పుచప్పుళ్లతో అంబేద్కర్ విగ్ర హం వద్దకు ఊరేగింపుగా వచ్చి నివాళులర్పించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం దళిత బడుగు బలహీన వర్గాలు రాజకీయ పదవులు, చదువుకొని ఉన్నతమైన స్థితిలో ఉన్నారన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జూపాక ఉమామహేశ్వర్, మాజీ ఎంపీ పీలు గోపగోని సారయ్యగౌడ్, నూనేటి సంపత్‌యాదవ్, నాయకులు పాల రాజేశం, అంబాల రాజేందర్, మాదాసు సతీష్, తూడ్ల రాజయ్య, సాగర్, శిరీష పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి వేడుకలు గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మున్సిపల్ టీజంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బొడ్డు రవీందర్, కుమ్మరి శ్రీనివాస్, కృష్ణవేణి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు. యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం వ్యాస రచన, వకృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. శారదానగర్‌లోని విశ్వహిందూ పరిషత్ భవన్‌లో సామాజిక సమరసత విభాగం ఆధ్వర్యంలో అయోధ్య రవీందర్, జిల్లా సంయోజక్ అడిగొప్పుల రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మేడగోని రవీందర్, బండ సమ్మన్న, లింగన్న, సంపత్ పాల్గొన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి కార్పొరేషన్ కార్యాలయం వద్ద అంబే ద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మిట్టపల్లి సతీష్, కోడూరి రమేష్, మచ్చ విశ్వాస్, నర్సయ్య, సంజీవ్, పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు కోటగిరి పాపయ్య, సంగెపు రాజు, గుండబోయిన ఓదెలు, రాజలింగం, పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మేధావి అంబేద్కర్



అంబేద్కర్ జయంతిలో కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగ్గ గొప్పమేధావి బాబాసాహేబ్ అంబేద్కర్ అని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం బస్టాండ్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన దేశానికి రాజ్యాంగాన్ని అందించారని, దేశాభివృద్ధికి అంబేద్కర్ దిశానిర్దేశం చేశారని తెలిపారు. ప్రపంచం గర్వించదగ్గ గొప్పమేధావి అంబేద్కర్ అని, ఆయన చూపిన మార్గంలో నడిచి దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి ప్రతీ ఒక్కరు కృషిచేయాలని తెలిపారు. అంబేద్కర్ చిన్నతనం నుండి అనేక వివక్షలను, అవమానాలకు ఎదుర్కొని పట్టుదలతో ఉన్నత విద్య అభ్యసించి దేశానికి మార్గదర్శకం చేశారని తెలిపారు. అంబేద్కర్ ఏ వర్గానికి చెందినవారు కాదని, ప్రతివర్గంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించారని, సమాజంలో ఉన్న అసమానతలు తగ్గించేందకు ఆయన కృషిచేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వినియోగించుకుం టూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. అధికారులు, సిబ్బంది, సంఘాల ప్రతిని ధులు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా షెడ్యూల్ కులాల ఇన్‌చార్జి అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్

అంబేద్కర్ ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణావు అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని 102దేశాల వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని, ఇంతగొప్ప జయంతి వేడుకలు జరుపుకుంటున్న మహనీయుడు అంబేద్కర్ మాత్రమేనన్నారు. ప్రతి ఊరు, వాడల్లో జయంతి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అంబేద్కర్ దూరదృష్టితో అనేక సమస్యలను పరిష్కారం చూపుతూ రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు మనమంతా కలిసి పనిచేయాలన్నారు. జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. అంబేద్కర్ చిన్నతనం నుంచి అనేక అవమానాలు ఎదుర్కొన్నారని, సమాజంలో ఉన్న కులవివక్ష, హెచ్చుతగ్గులు తొలగించాలనే ఆశయంతో ఆయన పోరాడారన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. బస్టాండ్ చౌరస్తాను అంబేద్కర్ కూడలిగా నామకరణ చేయాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. దసరా నాటికి బస్సు డిపో పనులు పూర్తిచేసి ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, అధికారులు మాట్లాడారు. కులాంతర వివాహం చేసుకున్న 9జంటలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, అధికారులు, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శంకర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు వడుకాపూర్, కాచాపూర్, తెలుకుంట, కుమ్మరికుంట గ్రామాల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. జూలపల్లి, తెలుకుంటలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరిమనోహర్‌రెడ్డి లు వేర్వేరుగా పాల్గొన్నారు. నాయకులు కన్నం భరత్, వేల్పుల ఓదెలు, వేల్పుల గట్టయ్య, మొగురం రమేష్ పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలను కొన సాగిద్దామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సాపూర్, ధూళికట్ట, సుల్తాన్‌పూర్, శివపల్లి, ముప్పిరితోట, ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి, బురహాన్‌మియాపేట్ గ్రామాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవ్వంపల్లి చంద్రయ్య, మండిగ రేణుక, కవ్వంపల్లి లక్ష్మి, సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, బాపయ్య, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల ప్రధాన కూడల్లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అంబేద్కర్ జాతికి చేసిన సేవలను కొనియాడారు.

భావితరాలకు స్ఫూర్తిగా నిలిచిన అంబేద్కర్



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

కోల్‌సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమానికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. దూర దృష్టితో దేశ భవిష్యత్తును ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించి భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అ అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేం ద్రరావు, ఆర్ఐ దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, సీసీ హరీష్ పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో ఆర్ఎఫ్‌సీఎల్ సైట్ ఇన్‌చార్జి సిజిఎం ఉదయ్ రాజహంస అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉదయ్ రాజహంస మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల హక్కుల పోరాటం కోసం కృషి చేసిన మహనీయులన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి కమిషనర్ అరుణశ్రీ పూల మాల వేసి నివాళులర్పించారు. వెంకటస్వామి, పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బిఎస్‌పి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో



అంబేద్కర్ నివాళులర్పిస్తున్న ఎన్టీపీసీ జీఎం ఎ.కె.త్రిపాఠి

జ్యోతినగర్, : అంబేద్కర్ జయంతిని ఎన్టీపీసీలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ పార్కులో జరిగిన కార్యక్రమానికి ఎన్టీపీసీ జీఎం అలోక్ కుమార్ త్రిపాఠి హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీఎం మాట్లాడుతూ ప్రతి పౌరుడు అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. బాబర్ సలీం పాషా, విజయ్‌కుమార్ సిక్దర్, నవనీత్ రాథోడ్, అంజయ్య, కొలిపాక సుజాత, కవితారెడ్డి, కృష్ణయ్య, పాల్గొన్నారు.

ఫైవింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతిని ఆర్జీ-2 యాజమాన్యం నిర్వహించింది. జీఎం బండి వెంకటయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీహెచ్‌పీలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఓడీ సదానందం పాల్గొన్నారు. శ్రీనివాస్, బొక్కల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు. సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, ఉల్లి మొగిలి, వెంకన్న పాల్గొన్నారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, తిరుపతి, సదయ్య, పాల్గొన్నారు.

ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1లో ప్రాజెక్టు అధికారి రాజశేఖర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పీఈ ఉదయ్‌భాస్కర్, మేనేజర్ రమేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు గడ్డం తిరుపతి, వెంకటస్వామి, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ తిరుపతిరావు పాల్గొనారు. బేస్‌వర్క్‌షాప్‌లో పీఓ రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాదనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన జయంతి ఉత్సవానికి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాగేశ్వర్‌రావు, వినాయక్, శేఖర్‌బాబు, గుర్రం శ్రీహరి, రాజేంద్రప్రసాద్, ఐలయ్య, బత్తులశంకర్, కిషన్, పాల్గొన్నారు.

సామాజిక సమానత్వం నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర కీలకం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సామాజిక సమానత్వం నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర కీలకమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని, దళితుల హక్కుల పరిరక్షణకు జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అంబేద్కర్ ఆశయాలను నేరవేర్చడానికి ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలన్నారు. కమిషనర్ అరుణశ్రీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు కాల్వ లింగస్వామి, బొంతల రాజేష్, మహంకాళిస్వామి, జాలి రాజమణి, పెద్దెల్లి ప్రకాష్, తేజస్విని, ముస్తఫా, తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, తాళ్ళపెల్లి యుగందర్, రమేష్ పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రచించి అంబేద్కర్ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సింగరేణి ఆర్జీ-1 ఆధ్వర్యంలో సోమవారం జీఎం కార్యాలయం వద్ద నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి ఆయన హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తొలగించడానికి అంబేద్కర్ కృషి చేశారన్నారు. ఇప్పుడు అందుతున్న ఫలాలు అంబేద్కర్ కృషి వల్లనే అని చెప్పారు. ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో కులవ్యవస్థను రూపుమాపడానికి దేశంలో భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదాన్ని తీసుకువచ్చారన్నారు. ప్రధానచౌరస్తా నుంచి జీఎం కార్యాలయం వరకు మహిళా డప్పు కళాకారులతో కోలాటం, నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు అనితాలలిత్‌కుమార్, నాయకులు కె.స్వామి, దామోదర్‌రావు, వెంకటేశ్వర్లు, సురేష్, శ్రీనివాస్, నర్సయ్య, ఆరెపల్లి హరీష్, జైపాల్, జాదవ్, పాల్గొన్నారు.

మున్సిపల్ టీజంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున్, విజయ్, గోవర్ధన్‌రెడ్డి, ఉన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతిని సుల్తానాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, వివేక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాశ్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, కమిటీ బాధ్యులు న్యాతరి శ్రీనివాస్, ప్రభాకర్, క్యాదాసి చంద్రమౌళి, చిలుక రాజేశం,

రామునిపల్లిలో సీతారామచంద్ర స్వామి రథోత్సవం

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రామునిపల్లిలోని సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు సౌమిత్రి ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వారం రోజులుగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుఝామున రథోత్సవం జరిగింది. సాయంత్రం నాగవల్లితో కార్యక్రమాలు ముగిసాయి. ఎమ్మెల్యే విజయరమణారావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల నిర్వహకులు అర్చకులు ప్రసాదాచార్యులు, వాసు తదితరులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

ఇల్లందకుంట, (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, అర్చకులు స్వామివారి జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

రామగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నాగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రాజమల్లు సతీమణి రమాదేవి ఇటీవల మృతి చెందింది. మంత్రి శ్రీధర్‌బాబు రమాదేవి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్లతిరుపతియాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు రొడ్డబాపన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తొటచంద్రయ్య, నాయకులు వనంరాంచందర్‌రావు, తీగల సమ్మయ్య, ఎరుకుల ఓదెలు, పాల్గొన్నారు.

కుల సమాజం అంతం కావాలి

- సమతా ర్యాలీ సభలో బుద్ధవనం ఓఎస్‌డీ మల్లేపల్లి లక్ష్మయ్య



సభలో మాట్లాడుతున్న మల్లేపల్లి లక్ష్మయ్య

గోదావరిఖని, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కుల సమాజం అంతమైనప్పుడే పేదల నిర్మూలన అవుతుందని బుద్ధవనం ఓఎస్‌డీ మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా గోదావరిఖని చౌరస్తాలో దళిత, యువజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమతా ర్యాలీ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ చెప్పినట్టు కులాలు పోవాలంటే ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కుల వ్యవస్థ హిందుత్వం పుట్టిందని, దీనిని మార్చడం బౌద్ధ సమాజంతోనే సాధ్యమని 1956లో బౌద్ధిజం స్వీకరించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకే కాకుండా బీసీ, మైనార్టీలకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేశారన్నారు. నిరక్షరాస్యులకు ఓటు హక్కును అంబేద్కర్ కల్పించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ప్రకారం బడ్జెట్ కేటాయించాలని, విద్య, వైద్యంకు పెద్దపీట వేయాలని కోరారు. రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేసే వారిని హత్య చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కోకంటి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, దళిత యుజన నాయకులు గుమ్మడి కుమారస్వామి, కాసిపేట లింగయ్య, మాదాసు రామమూర్తి, పులి మోహన్, కౌశిక హరి, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, కే స్వామి, జేవీ రాజు, పల్లె బాబు, ధర్మేందర్ పాల్గొన్నారు.

ఘనంగా సమతా ర్యాలీ

అంబేద్కర్ జయంతి సం దర్భంగా దళిత యువ జన ఐక్య వేదిక నాయకులు గుమ్మడి కుమారస్వామి, కాసిపేట లింగయ్య ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఫైవింక్లయిన్ చౌరస్తా నుంచి సమతా ర్యాలీని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటాన్ని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గోదావరిఖని చౌరస్తాలోని వేదిక వద్దకు తీసుకువచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దే



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధు

మంథని, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్ పార్టేనని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మహనీయుల దీక్షాపరులతో కలిసి ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం శోభాయాత్ర నిర్వహించారు. పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ తరహాలో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగంతో తిరగాలన్నారు. మహనీయుల చరిత్ర తెలుసుకోకపోతే మోసపోతూనే ఉంటామన్నారు. మంథనిలో కాంగ్రెస్ వాళ్ళు అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి తమ పోరాటమే కారణమన్నారు. మంథనిలో ఒక మహనీయుడి విగ్రహాన్ని ఆవిష్కరించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అమలు కాని హామీలు ఇచ్చారన్నారు. సీఎం కేసీఆర్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచాడన్నారు. జక్కు రాకేష్, తగరం సుమలత, శంకర్‌లాల్, మాజీ రాజుగౌడ్, శంకర్‌గౌడ్, కన్నూరి శ్రీశైలం, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, పాల్గొన్నారు.

మంథనిరూరల్: మండలంలోని గుంజపడుగులో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి జయంతిని నిర్వహించారు. కుంట రాజ, కండె రమేష్, కాసిపేట వెంకటేష్‌లు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అవమాన పరుస్తుందని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సచివాలయం పక్కనే విశాలమైన స్థలంలో అంబేద్కర్ విగ్రహన్ని ఏర్పాటు చేసి ప్రజల సందర్శనకు అవకాశం కల్పిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు సందర్శించకుండా గేట్లకు తాళాలు వేశారన్నారు.

ఎవరికి వారే...!

(5వ పేజీ తరువాయి)

న్నారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి అం దరు ప్రజాప్రతినిధులు ఒకే వేదికను పంచుకోకపోవడం గమనార్హం. ఆదివారం మంథని నియోజకవర్గంలో పర్యటించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సోమవారం మంథనిలో జరి గిన అంబేద్కర్ జయంతి వేడుకలతోపాటు ఇతర కార్య క్రమాల్లో పాల్గొని మంచిర్యాల జిల్లాలో ఉప ముఖ్యమం త్రి పాల్గొన్న సభకు వెళ్లారు.

జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాత్రమే హాజర య్యారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ సుల్తానాబాద్, పెద్దపల్లి, కమాన్‌పూర్, పెంచికల్‌పేట్, గోదావరిఖనిలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. మంథని మండలం రామయ్యపల్లెలో పీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆరంభించారు. అలాగే మంచిర్యాల జిల్లాలో జరిగిన కార్యక్రమాలకు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్న సభకు హాజరు కాలేదని తెలిసింది. అధికారిక కార్యక్రమాలకు ఎంపీకి సమాచారం ఉంటుందా, లేదా అనే విషయం తెలియడం లేదు. అధికారిక కార్యక్ర మాలు జరిగిన రోజే ఎంపీ తన అనుచరులతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం అనుమానాలకు తావి స్తున్నది. వంశీకృష్ణ ఎంపీగా గెలుపొంది పది మాసాలు గడుస్తున్నది. నియోజకవర్గ కేంద్రమైన పెద్దపల్లిలో ఎంపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకపోయినా మంచి ర్యాలలో అందుబాటులో ఉంటున్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారంభించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో రైతులు ధాన్యాన్ని విక్ర యించుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. అలాగే నిబంధనలు పాటిస్తూ గింజ కటింగ్ లేకుండా కొనుగోళ్ళు ఉంటా యన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సీఈఓ బూరుగు సంతోష్, డైరక్టర్లు, నాయకులు అధికారులు రైతులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జార్జిరెడ్డి ఆశయ సాధన కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిడిఎస్‌యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణా ప్రతాప్ అన్నారు. పిడిఎస్‌యు సంస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బాలుర వసతి గృహంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కెంసారపు రవితేజ, నాయకులు కొయ్యడ బాబు, ఎండి అస్లాం, రమేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.